క్లుప్తంగా

సత్కారం

చార్మినార్: బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఇన్‌చార్జి గాదెపాగ జగ్జీవన్‌రామ్ (జీవన్ జీ) శనివారం రాజ్యసభ సభ్యులు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా కప్పి సత్కరించారు. శనివారం జరిగిన బీజేపీ ఎస్సీ మోర్చా గ్రేటర్ హైదరాబాద్ ట్రెనింగ్ కార్యక్రమం సందర్భంగా లక్ష్మణ్‌ను కలిసి అభివృద్ధిపై చర్చించినట్లు జగ్జీవన్‌రామ్ తెలిపారు.

నేటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

గన్‌ఫౌండ్రీ: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నుమాయిష్ జరుగుతున్న నేపథ్యంలో నేటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలను విధిస్తున్నట్లు నగర సీపీ సీవీ.ఆనంద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నుమాయిష్‌కు పెద్ద ఎత్తున సందర్శకులు వస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అఫ్జల్‌గంజ్ నుంచి నాంపల్లి మీదుగా వెళ్లే ఆర్‌టీసీ, ప్రైవేటు బస్సులతో పాటు హెవీ వాహనాలను ఎంజే మార్కెట్ మీదుగా అబిడ్స్ వైపు దారి మళ్లిస్తారని తెలిపారు. పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి నాంపల్లి వైపు వెళ్లే బస్సులను ఏ.ఆర్. పెట్రోల్ పంప్ మీదుగా బీజేఆర్ విగ్రహం వైపు దారి మళ్లిస్తారు. బహదూర్‌పురా, మూసాబ ౌలి, బేగంబజార్ ఛత్రి, దారుసలాం ప్రాంతాల నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం వైపు వచ్చే వాహనాలను ఆయా ప్రాంతాలలో దారి మళ్లింపు ఉంటుందని తెలిపారు.

రుక్మిణీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



వేడుకలకు హాజరైన మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర తదితరులు

గౌలిపురా: గౌలిపురా సర్దార్ పటేల్‌నగర్‌లోని పాండురంగ విఠల్ రుక్మిణీ దేవాలయంలో వారం రోజులుగా జరుగుతున్న అఖండ తాళ సప్తాహ కార్యక్రమంలో భాగంగా శనివారం గౌలిపురా మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జితేంద్రను ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎం.విలాస్‌రావు, తులసీరామ్, శివాజీరావు, బాలాజీ, దిగంబరా, దొండేరామ్, కాశీనాథ్, నాయకులు ఇ.సుమన్‌కుమార్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

యువకులకు కౌన్సెలింగ్

గౌలిపురా: మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి ఆపరేషన్ ఛబుత్రా కార్యక్రమం నిర్వహించారు. రోడ్లపై అనవసరంగా తిరుగుతున్న యువకులను స్టేషన్‌కు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యుల సమక్షంలో ఇన్‌స్పెక్టర్ ఎ.శివకుమార్ వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

మజ్లిస్ నాయకుడు మసూద్ అహ్మద్ మృతి

గోల్కొండ: మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకుడు మసూద్ అహ్మద్ (68) శనివారం మృతిచెందాడు. గోల్కొండ డివిజన్‌లో క్రియాశీల కార్యకర్తగా గుర్తింపు పొందిన మసూద్ అహ్మద్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆరోగ్యం క్షీణించడంతో శనివారం సాయంత్రం కంపెనీబాగ్‌లోని ఆయన నివాసంలో మృతిచెందాడు. ఆయన మృతి పట్ల కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అహ్మద్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

కేఎం మున్షీ జయంతి

నాంపల్లి: భారతీయ విద్యాభవన్ వ్యవస్థాపకుడు, దివంగత డాక్టర్ కేఎం మున్షీ 135వ జయంతి వేడుకలను శనివారం భారతీయ విద్యా భవన్ వేదికపై ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ జస్టిస్ వై.భాస్కర్‌రావు హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కె.ఎం.మున్షీ భారతీయ విద్యాభవన్‌ను నెలకొల్పారన్నారు. యువత మున్షీ ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ సంగీత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


మానవత్వం పరిమళించేలా సినిమా ఉండాలి

సాక్షి,సిటీబ్యూరో: పీడిత ప్రజల విముక్తి కోసం తెలుగు సినిమాలు తీయాల్సిన అవసరం ఉందని ప్రముఖ సినీ దర్శకుడు డాక్టర్ ఎన్.శంకర్ అభిప్రాయపడ్డారు. శనివారం ప్రభుత్వ సిటీ కళాశాల సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవత్వం పరిమళించే విధంగా సినిమా ఉండాలన్నారు. దర్శకుడు సాగర్‌చంద్ర మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతతో సినిమాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సినీ విశ్లేషకుడు రెంటల జయదేవ్, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి భారీ ఏర్పాట్లు



శ్రీమహావిష్ణువు వైకుంఠ విశ్వరూప దర్శనం కోసం చేస్తున్న ఏర్పాట్లు



క్షీర సాగరం



ఆలయం వెలుపల అలంకరణ ఏర్పాట్లు

జియాగూడ: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని జియాగూడ రంగనాథ స్వామి దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా ఈ ఆలయంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. కరోనా నిబంధనలు పూర్తి స్థాయిలో సడలించిన తర్వాత జరుగుతున్న ఉత్సవాలు కావడంతో ఈ సారి ప్రత్యేక సెట్టింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ప్రధాన గోపురం ఇరువైపులా భారీ ఎత్తున జయ విజయ విగ్రహాల దర్శనం, లోపల వైకుంఠం తలపించే రీతిలో శ్రీమహావిష్ణువు విశ్వరూప దర్శనం, ఉత్తర ద్వార దర్శనంలో గరుఢవాహనంపై వైకుంఠవాసుడి దర్శనం, క్షీర సాగరంలో శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి దర్శనం, మూలవిరాట్ దర్శనం, పద్మావతిదేవికి ప్రత్యేక అలంకరణ వంటి పలు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రత్యేక పూజలు..

సోమవారం వైకుంఠ ఏకాదశి మూల విరాట్‌కు అభిషేకం, వస్త్రాలంకారం, కోమాల సేవ, తిరుప్పావై సేవాకాలం, బాలభోగ నివేదనం, మంగళశాసనం, వైకుంఠ ద్వార దర్శనం, గరుఢ వాహన సేవ, ఐదు రోజుల పాటు రాపత్ ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ ప్రతినిధి శేషాచార్యులు తెలిపారు.

భైరి నరేశ్‌ను కఠినంగా శిక్షించండి



మొఘల్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు

గౌలిపురా: అయ్యప్ప స్వామితో పాటు హిందూ దేవుళ్లను కించపరిచే విధంగా మాట్లాడిన భైరి నరేశ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం విశ్వహిందూ పరిషత్ ఆర్యనగర్ జిల్లా (వీహెచ్‌పీ), భజరంగ్‌దళ్ నాయకుల ఆధ్వర్యంలో మొఘల్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యావత్ ప్రపంచం హిందూ దేవుళ్లను ఎంతో భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నట్లు తెలిపారు. అలాంటి దేవుళ్లపై నరేశ్ కించపరిచే విధంగా మాట్లాడి హిందువుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలన్నారు. వీహెచ్‌పీ నాయకులు విశాల్ సునాకర్, భజరంగ్ దళ్ నాయకులు కె.పవన్‌కుమార్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పీడీ యాక్ట్ నమోదు చేయండి: ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: అయ్యప్పస్వామి, హిందూ దేవుళ్లను కించపర్చేలా మాట్లాడిన భైరి నరేష్‌పై 24 గంటల్లోపు పీడీ యాక్ట్ నమోదు చేయాలని, లేనిపక్షంలో లక్ష మంది అయ్యప్ప స్వాములతో ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో రిలీజ్ చేశారు. తనపై అక్రమంగా పీడీ యాక్ట్ నమోదు చేసిన పోలీసులు హిందూ దేవతలను దూషించిన వ్యక్తిపై ఇంకా ఎందుకు పీడీ యాక్ట్ నమోదు చేయలేదని డీజీపీ అంజనీకుమార్‌ను ఆయన ప్రశ్నించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వ్యక్తిపై కొత్త డీజీపీ తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మారెడ్డి

యాకుత్‌పురా: హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2023 నూతన సంవత్సర కేలండర్‌ను శనివారం ఆవిష్కరించారు. పురాణి హవేలిలోని సిటీ సివిల్ కోర్టులోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అఖిల భారత న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు బోధా లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వి.సుబ్బయ్య, కార్యవర్గ సభ్యులు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

అఫ్జల్‌గంజ్: కేంద్ర మాజీ మంత్రి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలచారిని లీగల్ ఇండియా ట్రస్ట్ చైర్మన్, సుప్రీం కోర్టు న్యాయవాది కేఎస్ కృష్ణ, ట్రస్ట్ సలహాదారు, హైకోర్టు న్యాయవాది సీహెచ్ శ్రీధర్ కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కార్వాన్‌లో బీజేపీని బలోపేతం చేస్తాం

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో బీజేపీని ఎదురులేని రాజకీయ శక్తిగా తీర్చిదిద్దుతామని కార్వాన్ అసెంబ్లీకి పాలక్‌గా నియమితులైన కొత్త అశోక్‌గౌడ్ అన్నారు. శనివారం రాంసింగ్‌పురా వివేకానంద కమిటీహాల్‌లో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ కమిటీ, శక్తి కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మున్ముందు పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతపరుస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు పాండుయాదవ్, బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టి.అమర్‌సింగ్, గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి ఉండాలి

మాజీ మంత్రి జానారెడ్డి

గన్‌ఫౌండ్రీ: పోలీస్ రిక్రూట్‌మెంట్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని మాజీ మంత్రి జానారెడ్డి అన్నారు. పోలీసు రిక్రూట్‌మెంట్‌లో అవకతవకలు జరిగాయంటూ యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో డీజీపీ కార్యాలయం ముట్టడికి యత్నించగా వారిని అరెస్టు చేసి గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులను అరెస్టు చేయడానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చారో సమస్యను పరిష్కరించడంలోనూ అంతే చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. పోలీసు రిక్రూట్‌మెంట్ విషయంలో జరిగిన అవకతవకలపై నిరుద్యోగుల ఆందోళనకు మద్దతుగా యూత్ కాంగ్రెస్ ఆందోళన చేసిందని తెలిపారు. పోలీసులు అరెస్టు చేసే క్రమంలో ఇద్దరు కార్యకర్తలకు గాయాలయ్యాయన్నారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడిచిపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సంఘీ టెంపుల్‌కు ప్రత్యేక బస్సులు

సంతోష్‌నగర్: నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న సంఘీ వెంకటేశ్వరస్వామి దేవాలయానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిప్యూటీ రీజనల్ మేనేజర్(ఓ) జి.జగన్ తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సంఘీ దేవాలయాన్ని సందర్శించే భక్తుల సౌకర్యం కోసం కోఠి నుంచి సంఘీనగర్‌కు ప్రతి 20 నిముషాలకోసారి ప్రత్యేక బస్సు అందుబాటులో ఉంటుందన్నారు.

చిలుకూరు బాలాజీ ఆలయానికి..

గోల్కొండ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మెహిదీపట్నం నుంచి చిలుకూరి బాలాజీ టెంపుల్ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ మెహిదీపట్నం డిపో మేనేజర్ సూర్యనారాయణ తెలిపారు. బాలాజీ టెంపుల్ దర్శనం కోసం నేడు మాత్రమే ఈ బస్సు సర్వీసులు నడుస్తాయని చెప్పారు. రెగ్యులర్‌గా నడిచే బస్సులతో పాటు నేడు 10 ప్రత్యేక బస్సులను (నాన్ స్టాప్) నడుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆరాంఘర్, శివరాంపల్లి, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల వారికోసం ఆరాంఘర్ చౌరస్తా నుంచి బాలాజీ టెంపుల్ వరకు ప్రతి అరగంటకు ఒక బస్సు నడపనున్నట్లు తెలిపారు.

అన్నమాచార్య కీర్తనలు ఎంతో మధురం



నృత్య గురువు శేషుబాబును సన్మానిస్తున్న కృష్ణమోహన్‌రావు

గన్‌ఫౌండ్రీ: అన్నమాచార్య కీర్తనలు ఎంతో మధురమని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అన్నమాచార్య నృత్య స్వర నీరాజనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతను సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలన్నారు. బుక్ ఆఫ్ వరల్డ్‌లో స్థానం కోసం ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం పలువురు నృత్య గురువులను ఘనంగా సన్మానించారు. చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రముఖ కూచిపూడి నృత్య గురువు పసుమర్తి శేషుబాబు, టీవీ నటులు రాగిణి, వనిత బృంద, కళ పత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేతల్లో ఉద్రిక్తత

జియాగూడ: కుల్సుంపురా 2జే బస్టాండ్ నుంచి మేకలమండి రహదారికి ఇరు వైపులా ఉన్న అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ కూల్చివేసింది. దీంతో ఇక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శనివారం రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా జీహెచ్ఎంసీ పెద్ద ఎత్తున కూల్చివేతలు చేపట్టింది. రోడ్డును ఆక్రమించి నిర్మించిన పాన్‌డబ్బా, ఫాస్ట్‌ఫుడ్, టీ కొట్లు షెడ్డులను ఏడుచోట్ల కూల్చివేసింది. దీంతో స్థానిక గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టిందని ఆందోళన చేపట్టారు. అక్రమంగా రోడ్డును ఆక్రమించి నిర్మించిన షెడ్డులను మాత్రమే తొలగించామని అధికారులు తెలిపారు. మరికొన్ని షెడ్లను తొలగించకుండా అడ్డుకోవడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రిటైర్డ్ ఉద్యోగికి ఘన వీడ్కోలు

చాంద్రాయణగుట్ట: జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ సర్కిల్-9 పారిశుద్ధ్య విభాగంలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగిని శనివారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి జాయింట్ కమిషనర్ ఎం.ఎ.ఖదీర్, ఉద్యోగులు డి.బాబురావును పూలమాల వేసి శాలువా కప్పి వీడ్కోలు పలికారు. 39 ఏళ్లగా జీహెచ్ఎంసీలో విధులు నిర్వహించిన బాబురావు సేవలు అభినందనీయమని వారు కొనియాడారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులను పరామర్శిస్తున్న వెంకటేశ్

చార్మినార్: పోలీస్ నియామకాల్లో సడలింపులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం రాష్ట్ర యువజన కాంగ్రెస్ తలపెట్టిన చలో ప్రగతిభవన్ ముట్టడి నేపథ్యంలో పాతబస్తీలోని యువజన కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని పాతబస్తీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె.వెంకటేశ్ అన్నారు. యువజన కాంగ్రెస్ చాంద్రాయణగుట్ట, చార్మినార్ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు బోయ నరేశ్, చాకలి శైలేందర్, నాయకులు సందీప్, పవన్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి ఛత్రినాక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వెంకటేశ్ వారిని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఇన్ని రోజులు నోటిఫికేషన్లు ఇవ్వకుండా మోసం చేసిన ప్రభుత్వం ఇప్పుడు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చి దానిని తప్పుల తడకగా చేసి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని వెంకటేశ్ మండిపడ్డారు.

భైరి నరేశ్ వ్యాఖ్యలపై అయ్యప్ప మాలధారుల ఆగ్రహం



భాగ్యలక్ష్మి ఆలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అయ్యప్ప స్వాములు

చార్మినార్: అయ్యప్ప స్వామితో పాటు హిందూ దేవతలను కించపరిచే విధంగా మాట్లాడిన భైరి నరేశ్ వ్యాఖ్యాలను వ్యతిరేకిస్తూ వివిధ సంఘాలకు చెందిన అయ్యప్ప స్వాములు చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భైరి నరేశ్ చేత ప్రభుత్వం అయ్యప్ప స్వాములకు బహిరంగ క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప పాదయాత్ర సేవా సమితి అధ్యక్షులు బాలకృష్ణ గురుస్వామి, శబరిమల అయ్యప్ప సేవా సమితి ప్రతినిధి బుచ్చిరెడ్డి గురుస్వామి, భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ప్రతినిధి రాధాకృష్ణ గురుస్వామి, పలువురు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ కార్యవర్గం రద్దు

అఫ్జల్‌గంజ్: తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర, నగర కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ఆ సంస్థ వ్యావస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. అఫ్జల్‌గంజ్‌లో ఆయన మాట్లాడుతూ.. టీసీసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కార్యవర్గాన్ని రద్దు చేసి జనవరిలో నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తామని తెలిపారు. రెండేళ్లుగా సేవా కార్యక్రమాలను విజయవంతం చేసిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.